క్లుప్తంగా

పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి



సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలతో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

గొలుగొండ : బడుగు బలహీన వర్గాల ప్రజలు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని జిల్లా సీపీఎం కార్యదర్శి లోకనాథం కోరారు. ఏఎల్‌పురంలో దివంగత సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పేదలకు న్యాయం జరగలేదని, ఎన్నో ఏళ్లుగా బంజరు భూములు సాగు చేస్తున్న పేదలకు పట్టాలు మంజూరు చేయలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, రాజు, శివ, బెన్నెస్, కన్నబాబు పాల్గొన్నారు.

రోడ్డుపై వేసిన దుకాణాలు తొలగింపు



రోడ్డుపై వేసిన దుకాణాలను దగ్గరుండి తొలగిస్తున్న సీఐ రేవతమ్మ

మాకవరపాలెం : ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా మండల కేంద్రంలోని రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలను సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో ఎస్‌ఐ దామోదర్‌నాయుడు, సిబ్బంది తొలగించారు. ప్రతి మంగళవారం వారపు సంత రోజున దుకాణాలు వేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని సీఐ పేర్కొన్నారు. రోడ్డుపై దుకాణాలు పెట్టకుండా చూసుకోవాలని సంత వేలందారుడు కన్నాజీకి సూచించారు. దుకాణాలు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ వెంట పంచాయతీ కార్యదర్శి బాలదొర ఉన్నారు.

బిల్లులు రాని గృహాల రీ సర్వే



కె.జె.పురంలో సర్వే చేస్తున్న హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ సూరిబాబు

మాడుగుల రూరల్:గతంలో నిర్మించిన పక్కా గృహాల బిల్లుల మంజూరు కోసం రీ సర్వే ప్రారంభించారు. మండల హౌసింగ్ ఏఈ ఎం. సూరిబాబు ఆధ్వర్యంలో కె.జె.పురం గ్రామంలో మంగళవారం రీ సర్వే చేశారు. 2014–2018 మధ్య కాలంలో నిర్మించి, బిల్లులు రాని ఇళ్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేపట్టామని ఏఈ సూరిబాబు తెలిపారు. కె.జె.పురం గ్రామంలో 80 గృహాలు ఉన్నాయన్నారు. ఈ సర్వేలో ఎంపీటీసీ సభ్యురాలు లోవతల్లి, దాలిబాబు, వార్డు సభ్యులు బుద్ద నాగేశ్, టీడీపీ నాయకులు జోగినాయుడు, ఆదిబాబు, నారాయణరావు పాల్గొన్నారు.

బదిలీ అయిన కార్యదర్శికి సత్కారం



కార్యదర్శిని సత్కరిస్తున్న నాయకులు

మాకవరపాలెం: బదిలీపై వెళుతున్న కార్యదర్శికి సహచరులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని బూరుగుపాలెం సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న గంగరాజుకు బదిలీ అయ్యింది. మంగళవారం కార్యాలయంలో ఆయనను సన్మాన కార్యక్రమం జరిగింది. మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచ్ వొబ్బలరెడ్డి రమణ, తూటిపాల, మామిడిపాలెం, అప్పన్నదొరపాలెం, సర్పంచులు గవిరెడ్డి ప్రసాద్, బుద్దా రమణ, లాలం దుర్గినాయుడు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి గోవింద, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సరస్వతీ పూజలు

మాడుగుల : స్థానిక నవర వీధిలో వెలసిన దుర్గా పోలిపిల్లమ్మ బుధవారం సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ తెలిపింది. ఆలయంలో బుధవారం సరస్వతీ పూజలు జరగనున్నాయన్నారు. దాతల సహాయంతో 1200 మంది విద్యార్థులకు అమ్మవారి పూజ చేయించి ఒక పెన్ను , పుస్తకం ఉచితంగా అందజేస్తారన్నారు.

ఏ దారి చూసినా ఏమున్నది...!

- రహదారులు మొత్తం గోతులమయం
- ప్రయాణికులకు నిత్యం నరకం
- ప్రమాదాల బారిన వాహనదారులు
- రోడ్డు సమస్యలను పట్టించుకోని కూటమి నాయకులు



కొత్తకోట రోడ్డులో కూరుకుపోయిన లారీ



రోలుగుంట ఎంపీపీ పాఠశాల సమీపంలో చెరువును తలపిస్తున్న రహదారి



దెబ్బతిన్న రత్నంపేట-బీబీపట్నం రహదారి



ఆర్సీఎం చర్చి వద్ద గోతిలో దిగబడిన లారీ

రోలుగుంట : నెల రోజుల పైబడి వర్షాలు దంచి కొడుతున్నాయి. ఈ వర్షాలకు నిత్యం వాహనాలు, ప్రయాణికులతో రాకపోకలు సాగే బీఎన్ రోడ్డుతో పాటు మండలంలో రహదారులు కూడా పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. ప్రధానంగా నర్సీపట్నం డిపో నుంచి చోడవరం వచ్చి పోయే వాహనాల్లో ప్రయాణికులు గోతులు దాటేటపుడు, వాహనాలను తప్పించే సమయంలోను ప్రమాదాలకు గురవుతున్నారు. బస్సు, వ్యాను, ఆటో డ్రైవర్లు సైతం గోతుల్లో తమ వాహనాలు నడప లేకపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారి పొడవునా గోతులే...

ఈ మార్గంలో పెదబొడ్డేపల్లి జంక్షన్ నుంచి వడ్డాది వరకూ, రోలుగుంట పీహెచ్‌సీ కూడలి నుంచి పోలీస్‌స్టేషన్ దాటి కొత్త చెరువు మలుపు వరకూ సుమారు ఫర్లాంగు దూరం, భోగాపురం, కొత్తకోట, మేడివాడ గ్రామాల్లో బస్ స్టాపు వద్ద భారీలోతు గోతుల వద్ద ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి బోల్తాపడి గాయాలపాలవుతున్నారు. దారి పొడవునా రోడ్డు దెబ్బతిని పడిన గోతులు నూతుల మాదిరిగా ఉన్నాయి.

వాహనాలు పెరిగి రోడ్లపై భారం...

ఏటా వాహనాలు పెరుగుతున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులూ పెరుగుతున్నారు. పెరిగిన జనాభా అవసరాలకు తగ్గట్టుగా రహదారి సౌకర్యాలు మెరుగుపడడం లేదు. ఈ రహదారి సమస్య మెరుగుకు ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఎన్నికల ముందు, తరువాత కూడా ఇచ్చిన హామీ మాత్రం అలాగే ఉంది.

తరుచూ ట్రాఫిక్ జామ్

గత నెల మొదటి వారం స్థానిక ఆర్‌సీఎం చర్చి వద్ద భారీ లోడు వాహనం గోతిలో దిగబడి సుమారు గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్ అయింది. అతి కష్టంతో గోతిలోంచి ఆ వాహనాన్ని స్థానికులు బయటకు తీశారు. ఇటీవల కొత్తకోటలో కూడా ఒక వాహనం గోతిలో దిగబడింది. దీంతో తీవ్రంగా ట్రాఫిక్ జామ్ అయింది. నిండుగొండ నుంచి బుచ్చింపేట, వడ్డిప నుంచి రత్నంపేట మీదుగా బీబీ పట్నం తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి.

కూటమి నేతల హామీలు గాలికి...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులు బాగు చేస్తామని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, అనకాపల్లి ఎమ్మెల్యే సీఎం రమేష్ హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా రోడ్డు సమస్యను పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వం తీరుపై జనం మండిపడుతున్నారు. తక్షణం రహదారులు బాగు చేసి ప్రయాణికుల కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

వాహనాలు దెబ్బతింటున్నాయి..



నేను ఆటో తోలుకుంటూ జీవనోపాధి పొందుతున్నాను. భారీ వర్షాలకు రహదారులపై పడిన గోతులు లోతుగా ఏర్పడడం వల్ల ఈ గోతులు దాటేటపుడు తరచూ ఆటో మరమ్మతుకు గురవుతోంది. ఆటో సర్వీసుతో వచ్చే ఆదాయం కన్నా మరమ్మతులకు అయ్యే ఖర్చు ఎక్కువై అప్పులు పాలవుతున్నాను. ప్రభుత్వం స్పందించి రహదారులు బాగు చేయించాలి.

–మట్టా స్వామి, ఆటో డ్రైవర్, రోలుగుంట

మా కష్టాలు తీర్చాలి



జీవనోపాధికి వాహనాలు నడుపుకోవడానికి ఇదే ప్రధాని రహదారి. ఈ గోతుల రోడ్డులో నిత్యం ప్రయాణించడం వల్ల వాహనాలు ఇంజిన్, టైర్ల వద్ద కట్టలు దెబ్బతిని తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఖర్చులు పెరిగి మా జీవనోపాధి దెబ్బతింటున్నది. ప్రభుత్వం వెంటనే రహదారులు మరమ్మతులు చేసి ప్రయాణికుల కష్టాలు తీర్చాలి.

–గాలి వెంకటదొరబాబు, వ్యాన్ డ్రైవర్, రోలుగుంట

ప్రయాణం..నిత్యం నరకం



గోతుల రోడ్డులో ప్రయాణం నరకంగా ఉంది. ఆటోలోనే కాకుండా, బస్సులో ప్రయాణం చేసినా ఆ గోతుల కుదుపులో ఒళ్లు హూనం కావడం తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం రహదారుల సమస్య పరిష్కారానికి ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదు. వెంటనే గోతులు కప్పి రహదారి మరమ్మతులు పూర్తి చేసి రవాణా సౌకర్యం మెరుగుపరచాలి.

–పోతల రాజశేఖర్, సర్పంచ్, ఎస్.కొత్తూరు

8 మంది పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరిక

నాతవరం: పాడేరు ఏజెన్సీ మండలాల్లో పని చేస్తున్న 8 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీపై నాతవరం మండలానికి వచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జాయినింగ్ రిపోర్టు అందజేసి విధుల్లోకి చేరారు. మాధవనగరం పంచాయతీ కార్యదర్శిగా జి.డి.ఆర్.కల్యాణ్, లింగంపేట పంచాయతీ కార్యదర్శిగా వి.బాబుజీ, సుందరకోట పంచాయతీ కార్యదర్శిగా ఎల్.చిన్నారావు, చిన గొలుగొండపేట పంచాయతీ కార్యదర్శిగా వి.సూరిపడాల్, వి.బి.అగ్రహారం పంచాయతీ కార్యదర్శిగా ఎస్.తిరుపతిరావు జిల్లేడుపూడి పంచాయతీ కార్యదర్శిగా కె.వెంకటేశ్వర్లు, వెదురుపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఎం.సోమరాజు వై.బి.అగ్రహారం పంచాయతీ కార్యదర్శిగా ఎస్.వెంకటేశ్వర్లు విధుల్లోకి చేరారు.

వైభవంగా దుర్గమ్మ అంబలం పూజ



దుర్గాభవానీకి అభిషేకం నిర్వహిస్తున్న నాయుడు తదితరులు

కె.కోటపాడు : డి.అగ్రహారం గ్రామంలో సోమవారం రాత్రి లెక్కల నాయుడు(సామిల్లు) ఆధ్వర్యంలో దుర్గాభవానీ అమ్మవారి అంబలం పూజా కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. అమ్మవారి మండపాన్ని వేంకటేశ్వరస్వామి శంకు చక్రాల రూపంలో అరటిజోర్లు, బంతిపూలతో నిర్మాణం జరిపారు. గురుభవానీలు దుర్గాభవానీ అంబలం పూజను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం అమ్మవారిపై ఆలపించిన భక్తిగీతాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. అంబలం పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు డి.అగ్రహారం, గవరపాలెం, లంకవానిపాలెం, కొరువాడ, పింద్రంగి, కుమ్మపల్లి గ్రామాలకు చెందిన భవానీ మాలాధారులైన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూజా కార్యక్రమాల్లో చంద్రరావు, పైడంనాయుడు, లెక్కల నాయుడు, వేచలపు రూప పాల్గొన్నారు.

గబ్బాడలో పొలం పిలుస్తోంది...



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

నర్సీపట్నం : వరి పంటలపై ఆశించే తెగుళ్లపై రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలో గబ్బాడ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది.. కార్యక్రమం నిర్వహించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వరి పంటపై ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొడతెగులు ఎక్కువగా ఆశించినట్టు గమనించామని, దాని నివారణకు గట్లపై కలుపు మొక్కలు తొలగించాలని అన్నారు. తెగులు మొదటి దశలో ఉన్నప్పుడు హెక్సాకొనజోల్ 2 మి.లీ లీటర్ నీటిలో పిచికారి చేయాలన్నారు.

నాతవరం: వాతావరణ పరిస్థితులు మార్పులకు అనుగుణంగా తాము సూచించే సూచనలు రైతులు విధిగా పాటిస్తే ఆశించిన విధంగా దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రసాదరావు, రాజకుమార్ అన్నారు. గునుపూడి పీకేగూడెం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి శైలజ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పంట పొలాల్లో ప్రస్తుత వాతావరణం, వరి పంట వయస్సు రీత్యా వచ్చే తెగుళ్ల, వారి నివారపై రైతులకు అవగాహన కల్పించారు. నూతన వ్యవసాయ పద్ధతులు పాటించాలని అన్నారు. మండల వ్యవసాయాధికారి శైలజ మాట్లాడుతూ ఖరీఫ్ వరి పంట అయ్యేంత వరకు తమ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో సచివాలయంలో ఉంటారన్నారు. సలహాలు, సూచనలకు రైతులు సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీకే గూడెం ఆర్‌బీకే ఇంచార్జి శివరామరాజు, డీపీఆర్‌సీ ఏవో హరిత వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల : ఎం.కోడూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు ప్రస్తుతం ఖరీఫ్ వరి చేలుకు ఆశిస్తున్న తెగుళ్ల, వాటి నివారణపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు.

గొలుగొండ : పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏవో సుధారాణి తెలిపారు. పుత్తడిగైరంపేట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిరప, వరి పంటపై ఆశించే తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల తెగుళ్ల తగ్గుతాయని అవగాహన కల్పించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి



దేవరాపల్లిలో రెవెన్యూ సమస్యలపై ఆరా తీస్తున్న ఆర్డీవో ఆయిషా

దేవరాపల్లి: రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపాలని అనకాపల్లి ఆర్డీవో ఎస్. ఆయిషా ఆదేశించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అనకాపల్లి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయిషా తొలిసారిగా దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం అకస్మికంగా సందర్శించారు. స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ కె.అప్పారావు, మండల సర్వేయర్ గోవిందరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సతీష్‌తో మండలంలోని రెవెన్యూ పరమైన సమస్యలపై చర్చించారు. వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు.

చమ్మచింతలో తీరిన తాగునీటి చింత



బోరు నుంచి నీరు పట్టుకుంటున్న గ్రామస్తుడు

నాతవరం: మండలంలో చమ్మచింత గ్రామంలో మరమ్మతుకు గురైన చేతి బోరును బాగుచేయించి గ్రామస్తులకు తాగునీరు అందిస్తున్నారు. ఈనెల 8వ తేదీన తాగునీటి పథకం అధ్వానం..చేతిబోరు దైవాధీనం అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. యుద్ధ ప్రతిపాదికన బోరు బాగు చేయించి గ్రామస్తులకు తాగునీరు అందించారు. బోరు బాగు చేసేందుకు అవసరమైన సామాగ్రిని సర్పంచ్ వెలకాడ కొండబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మైనం వెంకట భాస్కర్ (బాబు) యుద్ధ ప్రతిపాదికన సమాకూర్చడంతో వారి సమక్షంలో బోరు బాగు చేశారు. నెల రోజులుగా చేతిబోరు మరమ్మతు కారణంగా తాగునీటికి కష్టాలు పడిన గ్రామస్తులు బోరు బాగుపడడంతో ఆనందం వ్యక్తం చేశారు.

విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలి



బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం : గ్రామాల్లో ప్రజల మన్ననలు పొందే విధంగా పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో ఏజెన్సీ ప్రాంత మండలాల్లో పని చేస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇటీవల నాతవరం మండలానికి బదిలీ అయ్యారు. వారు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జాయినింగ్ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు ఎంపీపీ లక్ష్మణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీ తన చాంబరులో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, నూతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అసలైన అర్హులకు అందాలంటే కార్యదర్శులు కీలకమన్నారు. గ్రామాభివృద్ధి సర్పంచ్ కార్యదర్శులు సమైక్యంగా పనిచేస్తేనే సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తి, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దుర్గమ్మవారు

నర్సీపట్నం : శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ఆరో రోజు మంగళవారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చనలు చేశారు.

మాడుగుల : మాడుగులలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దేవీతల్లి మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో దసరా పాక వద్ద రాష్ట్ర బంగారు పతక గ్రహీత ఎం.ఎం.దాస్ నిర్మలా బుర్ర కథ వారు నిర్వహించిన బుర్రకథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మాడుగుల రూరల్ : వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో గల దుర్గమ్మను మంగళవారం మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అష్ట లక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయంలో అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కె.జె.పురం శివాలయంలో పార్వతీదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. భవానీ భక్తుల భజన కార్యక్రమం నిర్వహించారు.

చోడవరం: చోడవరం పాతబస్టాండ్ దగ్గర వేంచేసియున్న దుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుపుతున్నారు. మంగళవారం కరెన్సీ నోట్లతో దుర్గాదేవి అమ్మవారిని అలంకరించారు. శ్రీరాంపట్నంలో అంబలంపూజ నిర్వహించారు.

రోలుగుంట : దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా భవానీ మాలలు ధరించిన భక్తులు ఆయా గ్రామాల్లో దుర్గమ్మ మండపాల వద్ద నిష్టతో పూజలు చేస్తున్నారు. మండపాల వద్ద భజనలతో దుర్గమ్మను కొలిచారు.

బుచ్చెయ్యపేట : శరన్నవరాత్రి దసరా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల ఆలయంలో అమ్మవారికి చక్రార్చన, దేవి త్రిరాత్రి వ్రతం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం




నూతనంగా ఎన్నికైన పాస్టర్స్ కార్యవర్గం

చోడవరం రూరల్ : అసెంబ్లీ నియోజకవర్గం చోడవరం పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కె.జీవన్ పాల్, కార్యదర్శిగా కె.జాన్‌డేవిడ్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా ఎస్.సామ్యూల్‌రాజ్, గౌరవ అధ్యక్షునిగా జి.జె.సుందర్‌సింగ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా జి.యోహాన్, కోశాధికారిగా పి.రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.రమణ, సంయుక్త కోశాధికారిగా ఆర్.డేనియల్, కన్వీనర్లుగా గూనూరు జోసెఫ్, వి.ప్రవీణ్‌కుమార్, లీగల్ అడ్వయిజర్‌గా పత్తి అబ్రహాంలను ఎన్నుకున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ఆత్మీయ సత్కారం



గరిశింగి కార్యదర్శి యశోద, డిజిటల్ అసిస్టెంట్ రేవతిని సత్కరిస్తున్న సర్పంచ్ రాము, ఎంపీటీసీ గోపి



బోయిలకింతాడలో కార్యదర్శి జామి అప్పారావు, డిజిటల్ అసిస్టెంట్ పరశురాంకు సత్కారం

దేవరాపల్లి: బోయిలకింతాడ పంచాయతీ కార్యదర్శిగా జామి అప్పారావు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ శ్రీహరి పరశురాం విశేష సేవలందించారని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు కొనియాడారు. ఈ మేరకు బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి అప్పారావు, డిజిటల్ అసిస్టెంట్ పరశురాంకు బోయిలకింతాడ సచివాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను సర్పంచ్‌తో పాటు అన్నం రాము, మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ దండే జాన్ విక్టర్, అన్నం రామునాయుడు, బొబ్బిలి రాము, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. గరిశింగి సచివాలయం పరిధిలో బదిలీ అయిన స్థానిక పంచాయతీ కార్యదర్శి పైలా యశోద, డిజిటల్ అసిస్టెంట్ రేవతిలకు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారిని స్థానిక సర్పంచ్ గూడెపు రాము, ఎంపీటీసీ కోలా గోపి, ఉప సర్పంచ్ రమేష్ సత్కరించారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

నర్సీపట్నం : చౌకబారు విమర్శలు మానుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావు టీడీపీ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఇసుక లేని కారణంగా భవన నిర్మాణ కార్మికులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఉచిత ఇసుక పంపిణీ చేసి కార్మికులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడితే, ఆయన పేరును ఉచ్ఛరించేందుకు అర్హత లేని టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డాడు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఈశ్వరరావు హెచ్చరించారు.

11న మంద కృష్ణమాదిగ రాక

నర్సీపట్నం : ఏబీసీడీ వర్గీకరణకు కృషి చేసి ఈనెల 11న విశాఖ విచ్చేస్తున్న మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి గాటీలు పిలుపునిచ్చారు. మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి మాదిగ ఉపకులాలు కలిసి వేలాది మంది ప్రజలు తరలివచ్చేలా నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు.

22 మద్యం షాపులకు 160 దరఖాస్తులు

చోడవరం రూరల్ : ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, చోడవరం స్టేషన్ పరిధిలోని 22 మద్యం దుకాణాల నిర్వహణకు లైసెన్సు పొందడానికి మంగళవారం నాటికి 160 దరఖాస్తులు అందాయని స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.వి.పాపునాయుడు తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం మాత్రమే అవకాశం ఉందని, ఆసక్తి గల వారు అన్ని నిబంధనలు పాటించి సాయంత్రం లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులను అందచేయాలని కోరారు. ఇప్పటి వరకు మండలాల వారీ అందిన ధరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలంలోని 8 షాపులకు తక్కువగా 38 దరఖాస్తులు అందగా, బుచ్చియ్యపేట మండలంలోని 5 షాపులకు అత్యధికంగా 51 దరఖాస్తులు, కె.కోటపాడు మండలంలోని 5 షాపులకు 40 దరఖాస్తులు దేవరాపల్లి మండలంలోని 4 షాపులకు 29 దరఖాస్తులు అందినట్టు సీఐ నాయుడు తెలిపారు. మద్యం దుకాణం లైసెన్సు కోసం దరఖాస్తు చేయదలచుకున్న ఆశావహులు ఏదైనా షెడ్యూల్డ్ బ్యాంకులో లైసెన్సింగ్ అథారిటీ , అనకాపల్లి పేరున రూ.2 లక్షలకు డీడీ తీసి, వారి గుర్తింపు ధ్రువపత్రంతో నేరుగా చోడవరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పెసా చట్టంతోనే గిరిజన పల్లెల ప్రగతి

నర్సీపట్నం : షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పెసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పెసా కమిటీ సభ్యుడు బత్తుల కృష్ణ డిమాండ్ చేశారు. సమత, గిరిమిత్ర సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీహోమ్‌లో మంగళవారం పెసా చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, ఏపీ ఆదివాసీ హక్కుల సంఘం అధ్యక్షుడు కళ్యాణ్ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాలు, గ్రామ సభల అమలుపై పెసా చట్టాలను నేటి గిరిజన యువత పూర్తిగా అవగాహన చేసుకోవడం ద్వారా దోపిడీ నుంచి గిరిజనులను కాపాడుకోవచ్చన్నారు.

ఆర్‌బీకేల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయాలి

కె.కోటపాడు : జీడి పిక్కలను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు డిమాండ్ చేశారు. జీడి రైతుల సమస్యలను వివరిస్తూ కింతాడ పంచాయతీ కార్యదర్శి అనురాధకు మంగళవారం ఆయన వినతిపత్రం అందించారు. జీడి రైతులు పండించిన 80 కిలోల జీడిపిక్కల బస్తాకు ప్రభుత్వం రూ.10 వేల మద్దతు ధరను అందించాలని కోరారు. జీడి పంట విస్తరణకు గతంలో ఇచ్చిన రాయితీని ప్రభుత్వం మరలా కల్పించాలని, జీడి పిక్కలు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్‌లను పంట ఎక్కువగా పండే ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నాయినిబాబు కోరారు.